

**'శివరామం'** [మహా సా॥ చదివి]

ఉదయం తొమ్మిది గంటలైనా తార నిద్దర పోతోనే వుంది... భర్త కొన్న తోటలో చిన్న బంగాళా కట్టించుకొని వొంటరిగా వుంటోందామె. నెదరి పోతూన్న పూలవాసనా తెలతెల పోతూన్న దీపం కొంత ఆమెకు తోడూ నీడాను. అననుభూతమైన సుఖస్వప్నాల్ని కంటోంది ఆమె.

పడక గది తలుపెవ్వరో గట్టిగా తట్టితే మేలుకొని తన శశి వచ్చాడేమో అని ఉలిక్కి పడి లేచి తలుపు కొంచం తెరిచి, అర్ధనగ్నమైన శరీరాన్ని దాచుకొంటూ ఆకాశమంత జుట్టు లోంచి మొగం మాత్రం కనుపించే లాగ చూచింది. ఎదురుగా నిలబడ్డది శశికాదు; పాలి పోయిన మొగంతో, ఎఱ్ఱబారిన కళ్లతో, దడదడలాడే గుండెల్తో, అహల్య...

చకితయైన తార కొంచం తేరుకొని, "ఇంకా సరిగ్గా తెల్లవారకుండానే వచ్చావేం? లోపలికి రా" అని అహల్యను లోనికి తీసుకు వెళ్లి కూర్చో పెట్టింది.

స్త్రీ సౌందర్యానికి మనోహరత్వం కూర్చే కన్నీళ్లు రాలుస్తూ ఉన్న అహల్య దగ్గరకు వచ్చి, తార ఆమె ముంగురులు సవరిస్తూ "ఏఁవమ్మా! అలా ఏడుస్తావు?" అంది. అహల్యకు దుఃఖం ఎక్కువై వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టింది.

కొంత సేపటికి తార ఆమెను సముదాయించి సంగతేమిటో చెప్పమంది. అహల్య తన కథ ప్రారంభించింది. "తారా! నాజీవితంలో సౌఖ్యమనేది కనుపించదు. పెంచి, పెద్దదాన్ని చేసిన తాతగారు, నా ఆశయాలికెంత విరుద్ధమైన భర్తకు సన్నిచ్చినా ఏదో విధంగా సరిపెట్టుకుంటూ వారికి అనుకూలంగా ప్రవర్తిస్తున్నాను. అయితేనేం? ఎప్పుడూ నన్నాయన అనుమానిస్తూ ఒక కంట కనిపెడుతోనే వుంటారు. ఆడుదానికి అంత కన్నా హింస మరొకటి లేదు కదా! అయినా సరే అని సహించుకున్నాను. పోనీ వున్న దాన్నెలాగో వుండక వొక గొప్ప తంటా తెచ్చి పెట్టుకున్నాను. దాన్నుండి తప్పించుకోవడానికి నువ్వు తప్ప ఇంక ఎవ్వరూ వుపాయం చెప్పేవాళ్లు లేరు" అంది.

"ఏమిటో చెప్పు. ఆలోచిద్దాము" అంది తార.

"మాయిల్లు గోదావరి గట్టునే వుంది. నువ్వెరుగుదువు గదా! ఇంటి పనులు అన్నీ అయి, ఆయన గారి కొలువు చాలించాక, మా వీధి గదిలో కూచుని, కిటికీతలుపులు తెరుచుకొని, ఆ యిసుక తిన్నెల్లో విహరించే యువతీ యువకుల్ని చూస్తూ, నాకష్టాల్ని మరచి పోయే దాన్ని. తెల్లవారిజామునే లేచి, నాలాగే యేడ్చే గౌతమిని చూస్తూ నన్ను నేనే సముదాయించుకొనే దాన్ని. ఇలాగ నిన్నటి వరకూ మంచిగానే ప్రవర్తించాను.

"నిన్న సాయంత్రం గోదావరి వొడ్డున కూర్చుని దారీపోయే వారి వంక మామూలుగా చూస్తున్నాను. ఏగో యాదాలాభంగా నా చూపులు మాయింటి ప్రక్కనున్న యింటిమీదికి వాలాయి. అక్కడ ఒక చక్కని అమ్మాయి వీధి గది కిటికీలో నుంచి వచ్చే పోయే వారి వంక చూస్తోంది. ఆ చూపుల్లో ఒక వింత ఆవేశం, ఆకర్షణా మెరుస్తున్నాయి. ఇన్నాళ్లనుంచీ ఆమె నెప్పుడూ నేను చూడనే లేదు. కొత్తగా వచ్చింది కాబోలు.

ఏమైతేనేం! ఆవింత చూపులు చూచే ఆవిణ్ణి పరీక్షగా చూడాలనుపించింది.

"చెక్కిలి క్రింద చెయ్యి చేర్చుకుని చిత్రమైన కళ్లతో ఆమె మగవారి వంక చూచేది. వాళ్లూ ఆమెను చూచేవారు. కుక్కల్లాగే మగవాళ్లు కూడా పసిగట్ట కలరు కాబోలు. ఆమె కిటికీ దగ్గరకు వచ్చే సరికి ప్రతీవాడూ ఎవడో చచ్చు ముసలాడు, గర్భదరిద్రుడూ తప్ప, అటు చూచే వాడే! ఇట్నుంచటూ, అట్నుంచిటూ, చూపుల్తోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. చూస్తూండగానే ఆమె కిటికీ తలుపు మూసేసింది. ఎవరో పెద్దమనిషిలాగే వున్నాడు ఒక ఆయన అయింట్లో ప్రవేశించి ఒక అరగంట అయాక ఇవతలకి వూడి పడ్డాడు.

"నాకు ఆశ్చర్యం వేసింది. ఆఁవిడేఁవీ మాట్లాడ లేదు గదా ఎలాగ తెలిసిందా మహానుభావుడికీ?... అదేదో కనిపట్టాలని జాగ్రత్తగా చూస్తూ కూర్చున్నాను. ఇంతలో ఇంకో పెద్దమనిషి ఆదారిని పోతున్నాడు. ఆమె ఒక చూపు పారేసింది. ఆయన తిరిగి చూశాడు. ఆమె ఒక చిన్ననవ్వు విసిరింది. ఆయనా నవ్వాడు. ఆమె కన్ను గీటింది, తారా, ఎంత నాజూకుగా గీటిందనుకున్నావ్: అలాగ మనం గీటగలమా అనిపించింది.

"ఏదేనా ఒకటి అనుకున్నానూ అంటే అది చేసే వరకూ నాకు నిద్దర పట్టదు, నీకు తెలుసును గా! తిన్నగా ఇంట్లోకి వెళ్లి అద్దంలో చూచు కొంటూ ఆలాగే కన్నుగీటాను... తారా! అంత ఆనుభవం గల ఆ అమ్మాయి కంటే కోటి రెట్లే ఎక్కువ సున్నితంగానూ, మనోహరంగాను గీటాను...

మళ్లీ ఆ యిసుక తిన్నెల్లోకి వెళ్లి కూర్చున్నాను. జనం రద్దీ తగ్గింది కాని ఇంకా ఆదో రకం వాళ్లు ఇటూ అటూ తిరుగుతోనే వున్నారు.........

"నేను సంసారిని గదా! నే నాసంజ్ఞ చేస్తే వీళ్లేమని భావించు కుంటూరూ?...ఈ ఆలోచన క్రమ క్రమంగా నాలో ప్రవేశించి నన్ను లొంగ దీసుకుంది, ఆ అమ్మాయి నో సారి అనుకరించాలి.

"మన కున్నదే అది. మనవి కోతి బుర్రలు. ఎవళ్లనో ఒకళ్లని అనుకరించాలి, భర్తనో, ప్రియులొన్నో, స్నేహితులొన్న నడకల్లోనూ, మాటల్లోనూ, భావల్లోనూ కూడా.

"ఏ పెద్దమనిషి కైనా కన్ను గీటితే నన్నర్థం చేసుకో గలడా లేడా?...ఏం జరుగు తుందో చూడాలనే వాంఛ నాలో పూర్తిగా ఆవరించింది. అందులో తప్పేముంది? ఒక సన్న చూపు, ఒక చిన్న నవ్వు, ఒక కన్ను గీటు, అంతే! తరువాత అతనెవరో, నే నెవరో. మళ్లీ ఈ జన్మలో చూచుకో నైనా చూచుకోం. ఇంకేం బాధ? ఎవళ్లకీ తెలియదు... ఈ ఆలోచన్లతో నాకా రాత్రంతా నిద్ర పట్ట లేదు.

"ఇంతలో కోడి కూసే వేళయింది. మా యింటాయన లేచి గోదావరికి బయల్దేగారు. నేనూ వారి వెంట వెళ్లి, ప్రాచిపని కోసం ఒక బిందెడు నీళ్లు ముంచుకొని వస్తున్నా. ఆ చల్లనిగాలీ, చక్కని వెన్నెలా, నాలో ఏదో విధమైన వాంఛను రేపాయి—తెలుసునుగా, ప్రతీ స్త్రీ ఒక్కొక్క సమయంలో, అణచుకో డానికి శక్తి కూడా లేక, అనుభవిస్తుంది—. అటువంటి వాంఛ, ఏం చేయను? మా ఆయన ఛాందసం వల్ల అట్టి, వున్నాలెన్ని నిరాసతో గడిపానూ!... కాని నిన్న రాత్రిమాత్రం...

"గట్టెక్కాను తారా! ఆదారినే ఠీవిగా నడుస్తూ ప్రకృతి సౌందర్యాన్ని తాగేస్తూ, ఒకాయన పోతున్నాడు. ఎందుకో తెలియకుండానే ఆయన వంక చూశాను. ఆయనా చూశాడు. పెదవులు వాటంతట అవి ఒక చిన్న నవ్వులో విరిగాయి. ఆయనా నవ్వాడు. కన్ను గీటాను—ఎంతనుకున్నావు—గీటా నా లేదా అని నేనే అనుమానించా.........తొందరగా ఇంట్లోకి పోయి తలుపు వేసు కో పోతే నా వెనకాలే ఆయన ప్రత్యక్షం. అప్పుడు నా మనస్సు ఎలాగ వుంటుందో వూహించుకో.



(నా వెనకాలే ఆయన ప్రత్యక్షం)

"నా తల తిరిగి పోయింది. గుండెలు కొట్టుకొన్నాయి. పని మనిషి వచ్చే వేళైంది. మా వారి కాపురాలది. చూసిందంటే ఇంకేముంది?... ఏం చెప్పను? ఏం చేయను? ఖంగారెత్తి పోయింది. ఎలాగో కొంచంధైర్యం తెచ్చుకొని, "అయ్యా పొరపాటు వచ్చింది. నేను మంచిదాన్ని. మావారు వస్తారు కూడాను దయుంచి వెళ్లండి" అన్నాను. ఆయన లోపలికి వచ్చి, తలుపు వేసి, నా మీద చేయివేసి, పొరపాటేముంది? ఎవ్వరైతే నేం! డబ్బెక్కువ ఇస్తాను. భగవా లేదు లే.

ని సంగతి నాకు తెలుసు గానీ ఆలస్యమైపోతోంది మరెక్కడ" అని, నాలుగు వంకలా చూశాడు. నా పడక గది ఎలాగ పోల్చుకొన్నాడో కాని నన్నందులోనికి లాక్కు వెళ్లాడు "ఏంబాగుందీగది" అనే సరికి నాకు కంపం వెత్తు కొచ్చింది. "నే నలాంటి దాన్ని కానండీ. కరుణించండి, నాభర్త వచ్చే వేళైంది కూడాను" అని బతిమాలు కొన్నాను. "ఆ గోదావరిలో జపం చేసుకుంటూన్న ముసలాడేనా నీభర్త? ఏడిశాడు. ఇంతలో రాడు లే. వచ్చినా వో పదిరూపాయలు మొహాన్ని కొట్టామంటే నోరెత్తడు. నాకు తెలుసునుగా" అని తీరుబడిగా కూచున్నాడు.

"నా కేడు పొచ్చింది. నయాన్ని చెప్పాను. బెదరించాను. బతిమాలుకున్నాను. ఏం చేసినా ఆయన కరిగేటట్టు కనబడ లేదు... ఏం చేయ నింక...అప్పుడే కోడి కూసింది. దాసీదో మావారో వచ్చేస్తారింక...ఈలోగా ఈయన గార్ని వొదుల్చుకోవాలి. ఈయన వూరికే కదిలేలాగ కనుపించ లేదు...తెలిసిందా...ఆయన పని జరిగే వరకూ వదల్డు...అందుచే ఏలాగా తప్పదు గనుక, ఎంత త్వరగా అయితే...ఎవ్వళ్లు చూడకుండా వుంటే చాలు. ఆగకుండా కొట్టుకుంటూన్న గుండెల్ని అదిమి పట్టుకుంటూ గది తలుపు మూశాను........

తార నవ్వడం మొదలు పెట్టింది. దిండులో మొహం దూర్చి వొకటే నవ్వు— వెర్రినవ్వు. కొంత సేపటికి సద్దుకొని "అతడు అందంగా వున్నాడా?" అంది.

"ఆయ్యో! ఎంతో అందగాడు, నీభర్తకన్నా నా భర్తకన్నా కూడాను"

"నీ మనస్సు కొంచం కుదుట బడిందా?"

"ఏం కుదుట బడ్డం అమ్మా! మళ్లీ వస్తానన్నాడు, రేపు, సరిగ్గా అదే వేళకి— నాకు భయంవేస్తోంది తారా! అలా నవ్వుతావే? ఆయన చొరవా, పట్టుదలా, నువ్వెరగవు. తలచుకొంటే వొళ్లు కంప మెత్తుతోంది. ఏం చేయాలో చెపుదూ!"

"ఏముంది? రానీ వస్తే!" అంది తార.

"అమ్మయ్యో! మళ్లీనా?"

"ఏం? నీ కిష్టం లేదా?

"వున్నా, లేక పోయినా, మా వారికి తెలిస్తే కొంప మునిగి పోదూ?"

" ఆఁ! మునిగింది!... ఎవరికి తెలుస్తుంది"

"ఏమో! నా కంత ధైర్యం చాలదు."

"సిస్సలైన తెలుగు బిడ్డవు...సరేలే! ఆయన పేరు తెలుసు కున్నావా?"

"ఆ! శచీంద్రుడు"

"అయితే......నలుగురితోటీ చెప్పి కాస్త గడబిడ చెయ్యి."

అహల్య తెల్లబోయి, "నలుగురితోనూ వల్లడి చేసుకోనా, అదేం తారా! ఇలాంటి సలహా చెప్పావు?" అంది. "కాసాకే విను మరి. నీభర్త రాగానే, నిన్నెవడో నెల రోజుల్నుంచి వెంట బడుతున్నాడని, నిన్న ఏదో అల్లరి పెట్టబోయాడని చెప్పు. మీ ఆయన నలుగుర్లోనూ గోలపెట్టి వాణ్ణి రాకుండా తరిమేసేటట్టు చేస్తాడు."

"అమ్మయ్యో! ఆయన నిజం చెప్పేస్తే?"

"నమ్మేదెవరు. మన సంఘం న్యాయాన్నీ ధర్మాన్నీ సత్యాన్నీ ఆచరణలో పెట్టేటంత చవ్చుది కాదు. అన్ని విధాలా ముసలివాడే కనుక, ఇంకా కొన్ని నాళ్లవరకూ నీభర్త లాంటి వాళ్ల మాటలు చెలామణీ అవుతాయి. ఆయన గారు నలుగుర్లోనూ గోల పెట్టాడంటే సరి."

"పాపం! ఆశచీంద్రు డెంత బాధ పడతాడో?"

"ఏంచేస్తావు, సాహసం లేనప్పుడు?"...

"ఏం చేస్తాను" అని పరధ్యానంగా అనుకుంటూ, ఒక నిట్టూర్పు విడిచింది అహల్య. కొంచం సేపాగి,

"పడతాను, తారా!" అంది. నడుస్తూ "నాలుగు కాసులు కూడా యిచ్చాడు" అనుకుంది.

తార తలుపు వేసుకుంటూ "మీ ఆయనకి ఒక తోడాలజత చేయించిపెట్టు" అని కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుకుంది.

---:o:---

నమోనా ఉచితము

ఇండోబామ్




ఇతర అంజనములు, బాములవలె మండదు. ఒకతూరి వాడినవారు మగల మరల వాడుచు స్నేహితులకు సిఫారసు జేయుచున్నారు. తలనొప్పులు, పార్శ్వపు నొప్పులు, వాయువుపోట్లు, వెన్నుపోటు, బెణుకులు, పంటినొప్పి, జలుబు, దగ్గు మొదలుగు బాధలను పోగొట్టును. అమూల్యముగు ఓషధులచేతయారు కాబడినది. బాధగల స్థలమున మందుతో తోమిన చర్మమునందు ప్రవేశించి బాధను పోగొట్టును. అన్నివిధములగు నొప్పులకు బాధలకు సిద్ధౌషధము. ప్రతిచోటను ఏజెంట్లు కావలయును.

చక్కని డబ్బీ సహా బుడ్డి 1-కి రూ. 0-8-0 బుడ్లు 3-క రూ. 1-4-0

పోస్టు ఖర్చులు వేరు.

కార్నిక్ బ్రదర్స్, గిర్గాం, బొంబాయి. 4